క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



శాయంపేట : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రంజిత్‌రావు ప్రజలను కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, మట్టి గోడల ఇళ్లలో ఉండొద్దని సూచించారు. వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద ఉండొద్దని, విద్యుత్ స్తంభాలు, వైర్లు ముట్టుకోవద్దని తెలిపారు. ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీస్‌లకు తెలుపాలని కోరారు.

యువకుల శ్రమదానం



వేలేరు : మండల కేంద్రంలోని సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలకు వెళ్లే దారిలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గుంతలు ఏర్పడి నీరు నిలిచి ఉండటంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా గ్రామానికి చెందిన నవచైతన్య యూత్ సభ్యులు శ్రమదానం చేశారు. స్వంత ఖర్చులతో డోజర్ వాహనంతో పిచ్చి మొక్కలను తొలగించి, గుంతలను పూడ్చివేశారు. దీంతో యూత్ సభ్యులను కాలనీ వాసులు, గ్రామస్తులు అభినందించారు. యూత్ అధ్యక్షుడు శ్రీకర్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, సభ్యులు రాజు, శ్రీనివాస్, పరమేశ్, అనిల్, ముఖేష్ పాల్గొన్నారు.

పరామర్శ

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు గ్రామానికి చెందిన బుస్స సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందించారు. చుక్క రత్నాకర్, ప్రతీప్, క్రాంతిరాజ్, రాజేష్, సూర్యం ఉన్నారు.

'మోతెవారి లవ్ స్టోరీ' ఉచిత ప్రదర్శన

కమలాపూర్ : హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో గురువారం రాత్రి 'మోతెవారి లవ్ స్టోరీ' వెబ్ మూవీని ఉచితంగా ప్రదర్శించారు. మండలంలోని దేశరాజుపల్లికి చెందిన మార్విన్ వీడియోస్ నటులు రత్నాకర్, రాజేశ్వరి, సాగర్ నటించారు. కుటుంబ నేపథ్యం, బంధాలు, బంధుత్వాలను సమాజానికి మరోసారి గుర్తు చేయాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమాను రూపొందించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



రామన్నపేట: డ్రగ్, గంజాయికి యువత దూరంగా ఉంటూ ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని మట్టెవాడ ఎస్సైలు రాజేందర్, శివకృష్ణ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని ఎల్‌బీ కళాశాలలో విద్యార్థులకు పోలీస్ కళా బృందం ద్వారా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి వాటిని గుర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు, డయల్ 100 సమాచారం అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ సదానందం, అధ్యాపకులు, పోలీస్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య కళాశాల కార్మికుల సమ్మె

హన్మకొండ: వైద్య కళాశాల అధికారుల నిర్లక్ష్యం ఫలితంగానే మూడు రోజులుగా కార్మికులు సమ్మెబాట పట్టారని, దీనికి జిల్లా అధికార యంత్రాంగం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న కాకతీయ మెడికల్ కళాశాలలోని మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లలో పనిచేస్తున్న 86 మంది కార్మికులు గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు రాగుల రమేష్ సంఘీభావం తెలిపి మాట్లాడుతూ 8 నెలలుగా కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని వాపోయారు. వారి వేతన సమస్యను, ఈఎస్ఐ, పీఎఫ్ గురించి ప్రిన్సిపాల్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదా నాయక్, సీఐటీయూ మెడికల్ కళాశాల యూనియన్ నాయకులు రమేష్, అతిక్, ప్రశాంత్, పరమేష్ పాల్గొన్నారు.

'నానో'తో అధిక ప్రయోజనాలు



డ్రోన్‌తో నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ఆదిరెడ్డి (ఫైల్)



ఒంటిమామిడిపల్లిలో నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సునీల్‌కుమార్ (ఫైల్)

- గుళికల యూరియాతో పోలిస్తే మెరుగైన ఫలితాలు
- ధర తక్కువ, అధిక దిగుబడి
- రైతుల నుంచి పెరుగుతున్న ఆదరణ
- చైతన్య పరుస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



అందుబాటులో ఉన్న రెండు కంపెనీల నానో యూరియా డబ్బాలు

ఐనవోలు : పశువుల పెంపకం క్రమక్రమంగా తగ్గడంతో రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో పంటసాగులో రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. ఈ క్రమంలో నేలసారం, వాతావరణ సమతుల్యతపై ప్రభావం చూపడంతో పాటు పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో ఎరువుల వినియోగాన్ని దశల వారిగా తగ్గించేందుకు ప్రభుత్వం నూతన సంస్కరణలు చేపట్టింది. గుళికల రూపంలో ఉండే యూరియా, డీఏపీ స్థానంలో ద్రవ రూప యూరియా, డీఏపీని అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయంలో మొక్కల ఎదుగుదలకు నత్రజని కీలకపాత్ర పోషిస్తుంది. నత్రజనిని ఇప్పటి వరకు యూరియా రూపంలో అందిస్తుండగా ఈ గుళికల రూపంలో ఉండే యూరియాలో నత్రజని 50 శాతం కంటే తక్కువగా ఉంటుంది. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం నూతనంగా ద్రవరూపంలో నానో యూరియా, డీఏపీని అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రయోజనాలు

సాధారణ యూరియా కణ పరిమాణంతో పోల్చితే నానో యూరియా కణ పరిమాణం అత్యంత సూక్ష్మంగా నానో మైక్రాన్‌లుగా ఉంటుంది. దీని వల్ల మొక్కలో నత్రజని గ్రహణ సామర్థ్యం 80–90 శాతంగా ఉంటుందని, గుళికల యూరియా గ్రహణ సామర్థ్యం 30 శాతమే ఉంటుందని పలు అధ్యయనాలు చెబుతున్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. మార్కెట్‌లో లభ్యమవుతున్న 45 కిలోల యూరియా బస్తాలో ఉండే పోషకాలు, ద్రవరూపంలో లభించే నానో యూరియా 500 ఎంఎల్‌తో సమానం అని తెలుపుతున్నారు. ప్రస్తుతం ఎకరా పత్తి, మొక్కజొన్న, వరి తదితర పంటల్లో మూడు దఫాలుగా బస్తా యూరియా చొప్పున రైతులు వినియోగిస్తున్నారు. మార్కెట్‌లో లీటర్ నానో యూరియా రూ.250–300 వరకు ఉండగా ఇది రెండు యూరియా బస్తాలకు సమానం కాగా వాటి ధర కిరాయిలతో కలిపి రూ.600 వరకు ఉండనుంది. యూరియా చల్లేందుకు ప్రత్యేకంగా కూలీ అవసరం అవుతుండగా నానో యూరియా పిచికారీ సులవుగా ఉంటుందని, ధర కూడా తక్కువగా ఉండగా పెట్టుబడి భారం తగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మట్టి, నీటి కాలుష్యం తగ్గి పర్యావరణానికి మేలు చేస్తుందని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సంప్రదాయ యూరియా వినియోగంతో వచ్చే గ్రీన్ హౌస్ వాయువుల విడుదలను తగ్గిస్తుందని చెబుతున్నారు. మొక్కల పెరుగుదల, దిగుబడి, నాణ్యత, తదితర ఫలితంగా రైతుల ఆదాయం పెరుగుతుందని పలు అధ్యయనాలు తెలియజేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నానో యూరియా సూక్ష్మంగా ఆకులపై పిచికారీ చేయడం వల్ల సమర్థవంతంగా పనిచేయడంతో పాటు అన్ని దశల్లో పంటలకు నైట్రోజన్ అందుబాటులో ఉండి సరైన పోషణ అందుతుందని అంటున్నారు. సాధారణ యూరియా 2 నుంచి 3 రోజులు ప్రయోజనం చేకూరుస్తుండగా నానో యూరియా మొక్కకు అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగపడి 8 నుంచి 10 రోజులు ప్రయోజనకరంగా ఉంటుందని ఈ సందర్భంగా రైతులకు తెలుపుతున్నారు.

నానో ఎరువులను వాడుతున్నాం



నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. పిచికారీ కూడా సులభంగా ఉండటంతో ఈసారి మొక్కజొన్న, వరిలో నానో యూరియా పిచికారీ చేశాను. పెట్టుబడి భారం కూడా తగ్గింది.

\- రాజిరెడ్డి, రైతు, ఒంటిమామిడిపల్లి

రైతులను ప్రోత్సహిస్తున్నాం

పంటల క్షేత్రప్రదర్శనకు వెళ్లినప్పుడు నానో యూరియా, డీఏపీ గురించి రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నాం. బస్తాల రూపంలో ఉండే యూరియా, డీఏపీ వినియోగాన్ని తగ్గించి ద్రవ రూపంలో ఉండే ఎరువులను వినియోగించాలని, తద్వారా అధిక ప్రయోజనాలు పొందవచ్చని వివరిస్తున్నాం. గతేడాదితో పోలిస్తే ఈసారి నానో ఎరువుల వినియోగం మండలంలో గణనీయంగా పెరిగింది.

\-సునీల్ కుమార్, ఏఓ, ఐనవోలు

హద్దురాళ్లు పాతిన వారిపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార్మికులు

శాయంపేట : మండలంలోని మాందారిపేట శివారులో గల కుమ్మరికుంటలో అక్రమంగా హద్దురాళ్లు పాతినవారిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్ కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కల్వల సత్యనారాయణకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విజేందర్ మాట్లాడుతూ.. మండలంలోని చెరువులు, కుంటలను శాటిలైట్ ద్వారా డిజిటల్ సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. చెరువు, కుంటల కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం వల్ల మత్స్యకారులకు అనుకున్న స్థాయిలో ఉపయోగం లేదని, నాసిరకం చేప పిల్లలు ఇవ్వడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వినతిలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో చేపల మార్కెట్ లేకపోవడంతో రోడ్లపై చేపలు విక్రయిస్తున్నారని, వెంటనే చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. 50 ఏళ్లు దాటిన మత్స్యకార్మికులకు రూ.5వేల పింఛన్‌తో పాటు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలి

- ఎంపీడీఓ గుండె బాబు



వాగులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్ : మండలంలోని గోపాల్‌పూర్–బత్తినివానిపల్లి గ్రామాల నడుమ ఉన్న వాగులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని ఎంపీడీఓ గుండె బాబు నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. గోపాల్‌పూర్– బత్తినివానిపల్లి గ్రామాల నడుమ ఉన్న వాగు వంతెనకు అడ్డుగా ఇరువైపులా గుర్రపుడెక్క పేరుకుపోయిన కారణంగా వంతెన కింది నుంచి నీరు వెళ్లకుండా రైతుల పంట పొలాల్లో నిలిచి పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. ఈ మేరకు ఆయన వాగును, వాగు వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను గురువారం పరిశీలించి నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. గుర్రపుడెక్క తొలగించి వాగు నీరు సక్రమంగా పారేలా చూడాలన్నారు. రానున్న మూడురోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని అన్నారు.

అండగా నిలిచిన 'ప్రజ్వల్ యూత్'



కమలాపూర్ : మండలంలోని గూడూరులో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన కొండపాక మహేష్ కుటుంబానికి ప్రజ్వల యూత్ అసోసియేషన్ అండగా నిలిచింది. ప్రజ్వల యూత్ సభ్యుడైన మహేష్ కూతురు ప్రిన్సీ పేరిట రూ.50 వేలు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండుతో పాటు రూ.15 వేల నగదును బాధిత కుటుంబానికి అందించారు. ప్రజ్వల యూత్ సభ్యులు పున్నం, సుధీర్, రాజు, దిలీప్, రంజిత్, క్రాంతికుమార్, కిరణ్, సుమంత్, శ్రీనివాస్, రజనీకాంత్, శ్రీకాంత్, రాజేష్, రాజు, అనిల్, కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ



శాయంపేట : నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోందని ఆ పార్టీ జిల్లా నాయకుడు రఘుపతిరెడ్డి అన్నారు. మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన బల్ల సంతోశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ పార్టీ జిల్లా నాయకులు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ మేరకు రూ.32,500 ఆర్థిక సాయం అందించారు. రాజు, అభిలాష్, రాజయ్య, రఘోతంరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీను, సంతోశ్, సురేష్, సమ్మయ్య, ఆదిరెడ్డి, శ్రావణ్, చిరంజీవి, అశోక్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక చేయూతనందించిన స్నేహితులు



ధర్మసాగర్ : మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన పెసరు రవీందర్ (జేసీబీ) తండ్రి పెసరు కుమారస్వామి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న రవీందర్‌తో పదో తరగతి చదువుకున్న స్నేహితులు అండగా నిలిచారు. రూ.25,000 ఆర్థికసాయం అందించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేష్, అసాద్, కీర్తి, నారాయణ, సారంగపాణి, సాంబరాజు, రాజు, శ్రీనివాస్, వెంకటేష్, భిక్షపతి, నరేష్, తిరుపతి, భాస్కర్, బాలరాజు, అనిల్ ,శ్రీనివాస్, అశోక్, రాజేష్ ఆర్థిక సాయం అందించినవారితో ఉన్నారు.

పింఛన్ పెంచి మాట నిలబెట్టుకోవాలి

- ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు




మాట్లాడుతున్న నాయకులు

ధర్మసాగర్ : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పింఛన్ పెంపు హామీని వెంటనే నెరవేర్చాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ పెంపు చేస్తామని ఎన్నిక ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19వ తేదీన సన్నాహక సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని వికలాంగులు, పింఛన్‌దారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ యువ సేన జాతీయ నాయకుడు శివ మాదిగ, నాయకులు శాంతి సాగర్, మనోజ్, అన్వేష్, ప్రణయ్, ప్రశాంత్, ప్రతాప్, ప్రభాకర్, సుశీల్ కుమార్, దీపక్, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట జంక్షన్‌లో పోలీసుల తనిఖీలు

కాజీపేట రూరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట జంక్షన్‌లో గురువారం రాత్రి సివిల్ పోలీసులు, రైల్వే పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కాజీపేట సివిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ, ఎస్సై లవన్‌కుమార్, ఆర్పీఎఫ్ డాగ్ స్క్వాడ్, సిబ్బంది కలిసి తనిఖీలు చేస్తూ అనుమానాస్పద వ్యక్తుల వివరాలు తెలుసుకున్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి



పరకాల : ఈనెల 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లాలో నిర్వహించనున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు జక్కుల రాజ్‌గౌడ్ పిలుపునిచ్చారు. పరకాల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జక్కుల రాజుగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం నుంచి వెయ్యి మంది ప్రతినిధులు నాలుగు రోజులుగా జరిగే మహాసభలకు హాజరై ప్రజల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించడం జరుగుతుందన్నారు. నాయకులు ఓదేలు, రాములు, అశోక్, నిరంజన్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- కమ్యునిటీ హాల్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు: మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేటలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా కమ్యూనిటీ హాల్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరకాల నియోజకవర్గంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.32 కోట్లతో మహిళా భాగస్వామ్యంతో మహిళా డెయిరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షులుగా ఉన్న సమయంలో మాట ఇచ్చిన ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్కంపేట గ్రామాన్ని రెవెన్యూ విలేజ్‌గా మార్చారని, అలాగే డిజిటల్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, గ్రామానికి హెల్త్ సెంటర్ మంజూరైనదని, రూ.50 లక్షలతో సీతారామస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, నివాస గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్ ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సు కొనుగోలు, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఎం శారద, మండల ప్రత్యేకాధికారి నిర్మల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, మాజీ సర్పంచులు విజయ, కంచ రవికుమార్ కాంగ్రెస్ నాయకులు కృష్ణ, హంశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



గోదుమ బుట్టలను తలపై ఎత్తుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు : గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని చింతలతండా గ్రామంలో గురువారం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకొనే తీజ్ ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనాదిగా వస్తున్న ఆచారాలను, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పారు. అనంతరం గిరిజన యువతులు 9 రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో పెంచిన గోదుమ మొలకల బుట్టలను ఎమ్మెల్యే తలపై ఎత్తుకోగా.. గిరిజనులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి, సద్దాంహుస్సేన్, రాజిరెడ్డి, సమ్మయ్య, రవీందర్ యాదవ్, లక్ష్మణ్ నాయక్, రామచంద్రం, రమేశ్, సలీం మాలీక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

- హౌసింగ్ బోర్డ్ పీడీ సిద్ధార్థ్ నాయక్



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ సిద్ధార్థ్ నాయక్

వేలేరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ బోర్డ్ పీడీ సిద్ధార్థ్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని, ఫొటో క్యాప్చర్‌లో ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే ఇళ్లు మంజూరై నిర్మాణ పనులు మొదలుపెట్టని వారి నుంచి నాట్ విల్లింగ్ తీసుకోవాలని, పీఎంఏవై యాప్‌లో ఈనెల చివరి వరకు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ భాస్కర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

- తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతివలక్ష్మీదేవి

దామెర : విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని తహ సీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల మైనారిటీ, సాంఘిక సంక్షేమ, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం స్టోర్‌రూమ్‌లో స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఆర్ఐ సంపత్, ప్రిన్సిపాల్స్ హట్కర్ రమేశ్‌లాల్, సురేష్‌కుమార్, సమ్మయ్య ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మోదీ నిర్ణయాలతో దేశాభివృద్ధి



దామెర : ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



పరకాల : ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

- బీజేపీ నాయకులు



ఐనవోలు : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

దామెర / పరకాల / ఐనవోలు : ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయాలతోనే దేశాభివృద్ధి జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ఆ పార్టీ నాయకుడు కాశీప్రసాద్‌రావు, ఐనవోలు బీజేపీ మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ అన్నారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం దామెర మండల కేంద్రం, ఐనవోలు మండల కేంద్రం, పరకాల పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు తిరంగ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు దేశ ప్రతిష్టను పెంచాయన్నారు. ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో దేశ సైనికులు చేసిన పోరాటం వెలకట్టలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ సంతోష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు మధుకర్, రతన్‌కుమార్, సతీష్, మనోజ్‌రెడ్డి, ల క్ష్మణ్, రాజు, సుధాకర్, కొమురయ్య, పాల్గొన్నారు.